క్లుప్తంగా

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో శుక్రవారం హుండీ కానుల లెక్కించారు. నారాయణస్వామి, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లోని పర్మినెంటు హుండీలను లెక్కించగా రూ.7.90 లక్షలు వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఐదు నెలల్లో ఇంతటి మొత్తం ఆదాయం రావడం ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యుడు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయండి



వాటర్‌వర్క్స్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం పాతగుంతకల్లు కురుబగేరిలోని ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంకును పరిశీలించిన ఆయన ఎన్ని రోజులకోసారి ట్యాంకును శుభ్రం చేస్తున్నారని సిబ్బందిని ఆరాతీశారు. ట్యాంక్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటింటా చెత్తసేకరణ గురించి వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్మీ కంపోస్టుయార్డును పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

29 నుంచి ఐఎఫ్‌టీయూ రాజకీయ శిక్షణ తరగతులు

గుంతకల్లుటౌన్: ఈ నెల 29,30 తేదీల్లో గుంతకల్లులో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.సురేష్, డివిజన్ కార్యదర్శి జి.చిన్నా తెలిపారు. శుక్రవారం న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు ఏసురత్నం, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బేతాపల్లిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుత్తి రూరల్: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, గుత్తి మలేరియా అధికారి రామచంద్రనాయక్ సూచించారు. శుక్రవారం బేతాపల్లిలో పాఠశాల విద్యార్థులతో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా దోమలు వ్యాపించి మలేరియా, డెంగీ, చికున్‌గన్యా, మెదడు వాపు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయన్నారు. మురుగు రోడ్లపై ఉండటం వలన దోమలు వ్యాపించి విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. రాత్రి దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. హెచ్ఎం ఓబుళపతి, ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, సాధన, శివ ప్రసాద్, సుజాత, చంద్రకళ, నిరుపమ, మాదన్న, రత్నకుమారి, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీఎస్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



అధ్యాపకుడిని అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: శంకరానందగిరీ డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకుడు రేగుల సురేష్‌కు కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ శుక్రవారం తెలిపారు. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల(అనంతపురం) రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీంద్ర పర్యవేక్షణలో మాగ్నెటో హైడ్రో డైనమిక్స్ కన్వెక్టివ్ హీట్ త్రూ ఏ పోరస్ మీడియం ఇన్ ఏ వర్టికల్ ఛానల్ విత్ హాల్ ఎఫెక్ట్ అనే అంశంపై అధ్యాపకుడు రేగుల సురేష్ డాక్టరేట్ సాధించాడు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరితోపాటు, అధ్యాపకులు సురేష్‌ను అభినందించారు.

ప్రజా సేవలో ఆదర్శం



వృద్ధుడికి భోజనం ప్యాకెట్ అందిస్తున్న ఆదినారాయణ

వలంటీర్లకు వందనం

గుంతకల్లు రూరల్: గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తనవంతు సాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా మారాడు నాగసముద్రం వలంటీర్ ఆదినారాయణ. కరోనా సమయంలో రోగులకు సేవలందించిన వలంటీర్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నివశిస్తున్న అనాథల కోసం నిత్యం ఆటోలో నాగసముద్రం నుంచి ఆహార పొట్లాలు అందజేసేవాడు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులను తన మామ ఆంజనేయులు ఆటో తీసుకొని వెళ్లి వారికి క్షేమంగా ఇంటివద్ద దింపి వచ్చిన సందర్భాలు ఎన్నో. పానీ పూరీ అమ్మే వ్యక్తి బతుకుదెరువు కోసం ఒట్టి చేతులతో బీహార్ నుంచి తమ గ్రామానికి వస్తే ఆదినారాయణ ముందుండి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించడమే కాకుండా, గ్రామపెద్దల వద్ద నుంచి సాయం ఇప్పించి పానీపూరీ బండి ఏర్పాటు చేయించాడు. ప్రజాసేవలో నిమగ్నమైన ఆదినారాయణను గ్రామంలో ప్రతి ఒక్కరూ ఎంతో గౌరవిస్తారు.

దగ్గరుండి చూసుకున్నాడు...



కరోనా మహమ్మారి ప్రపంచానే చుట్టుముట్టిన సమయంలో నేను నా భర్య అంజలి, నా కూతురు దీప్తి ముగ్గురు కరోనా బారిన పడ్డాం. మా ఇంటివద్ద రెడ్‌జోన్ ఏర్పాటు చేయడంతో ఎవరూ అటువైపు తిరిగి చూడని పరిస్థితి. ఆ సమయంలో వలంటీర్ ఆదినారాయణ ఏమాత్రం భయపడకుండా రోజూ మా ఇంటివద్దకు వచ్చి మా ఆరోగ్య సమాచారం తెలుసుకునేవాడు. 15 రోజుల పాటు మాకు మందులు, వంట సరుకులు, ఇతరత్రా అన్ని అవసరాలు చూసుకున్నాడు. – రామాంజనేయులు, నాగసముద్రం

తనలా ఇబ్బంది పడకూడదని..



దివ్యాంగుడికి అల్పాహారం అందిస్తున్న వలంటీర్ రామాంజనేయులు

పెద్దపప్పూరు: పెద్దపప్పూరుకు చెందిన వలంటీర్ రామాంజనేయులు కరోనా బారినపడి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత తనలా ఎవరూ ఇబ్బంది పడకూడదని తనవంతుగా ప్రజలకు సేవలందించాడు. ప్రధానంగా అశ్వత్థ నారాయణ స్వామి సన్నిధిలో దిక్కులేని అభాగ్యులకు అశ్వత్థం ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, చాగల్లుకు చెందిన వైఎస్సార్ వీరాభిమాని రాఘవరెడ్డి సహకారంతో నిత్యం తిండి పదార్థాలను అందజేశారు. అలాగే మాస్కులు పంపిణీ చేసి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించాడు. కరోనా సమయంలో రామాంజనేయులు అందించిన సేవలను ఇప్పటికీ స్థానికులు గుర్తు చేసుకుంటుంటారు.

ఎంతో మంది అభాగ్యులకు సేవ...



కరోనా సమయంలో భిక్షాటన కోసం వచ్చిన వారికి వలంటీర్ రామాంజినేయులు దాతల సాయంతో మాస్కులు పంపిణీతో పాటు తిండిపదార్థాలను అందజేశారు. వలంటీర్ వ్యవస్థ లేకపోతే కరోనా సమయంలో ఎంతోమంది ఇబ్బందులకు గురయ్యేవారు. వలంటీర్ పుణ్యాన వారు కరోనాలాంటి విపత్తు నుంచి బయటపడ్డారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి.

–నారాయణ,ఆలయ స్వీపర్ అశ్వత్థం

గుత్తిలో అన్ని రైళ్లు ఆపేలా చర్యలు తీసుకోండి



ఎంపీ రంగయ్యకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్‌లో గతంలో మాదిరిగానే అన్ని రైళ్లను ఆపేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీనియర్ నాయకులు జీఎం బాషా, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్‌యాదవ్, కెఎం రంగనాయకులు, నిర్మలారెడ్డి, ఫరూక్, సుధాకర్, సాల్మన్, భాస్కర్, తిరుపాల్, రమేష్ ఏఏ రైళ్లే ఆగేవి ప్రస్తుతం ఏఏ రైళ్లు ఆగడం లేదు, దారి మళ్లించిన రైళ్ల గురించి వివరించారు. ఇందుకు ఎంపీ, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

కాలువ పనులు త్వరగా పూర్తి చేయండి



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: వరద కాలువ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్చెల్సీ అధికారులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన చాగల్లు ప్రాజెక్టు నుంచి అమ్మలదిన్నె కొండాపురం వరకు అక్కడక్కడ ఆగిపోయిన వరదనీటి కాలువ నిర్మాణం పనులను పరిశీలించారు. కాలువ నిర్మాణానికి ముంపునకు గురైన భూముల రైతులకు త్వరలో పరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జేసీ వర్గీయులు కాలువనిర్మాణం పనులను కొంతమేర చేసి ఆపివేశారన్నారు. ఆ పనులను కొన్ని నెలల క్రితం పున:ప్రారంభించామని, కాలువ నిర్మాణం పనులు పూర్తయితే షేక్‌పల్లి, నామనాంపల్లి, చిక్కేపల్లి, అమ్మలదిన్నె, కొత్తపల్లి గ్రామాలతోపాటు పుట్లూరు, తాడిపత్రి మండలాల్లో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్ రెడ్డి, హెచ్చెల్సీ అధికారులు పాల్గొన్నారు.

పశుపోషణ లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

బుక్కరాయసముద్రం: రైతులకు పశు పోషణ లాభదాయకంగా ఉంటుందని అనంతపురం పశుశాఖ జిల్లా అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డిపల్లిలో పశుగ్రాస విత్తన ఉత్పత్తి కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ సుబ్రమణ్యం, డీడీ డాక్టర్ రమేష్ రెడ్డి హాజరై మాట్లాడారు. పచ్చి పశుగ్రాసాల ద్వారా పాల ఉత్పత్తి పెరగడంతో పాటు నాణ్యమైన పాలను పొందవచ్చన్నారు. పశుగ్రాస మేపులో 75 శాతం ధాన్యం జాతి గడ్డి, 25 శాతం కాయజాతి గడ్డి మేపడం వలన పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పశుశాఖ ఏడీ డాక్టర్ రత్న కుమార్, శిక్షణ సంస్థ ఏడీ డాక్టర్ రామచంద్రారెడ్డి, పశుగ్రాస విత్తన క్షేత్రం ఏడీ సుబ్రహ్మణ్యం, డాక్టర్లు గోవిందరాజులు, పెద్దన్న, రాధిక, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాలి



తాడిపత్రిలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి అర్బన్: ఆటో డ్రైవర్లు ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని డీఎస్పీ సిఎం .గంగయ్య సూచించారు. శుక్రవారం సీఐలు శంకర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, ఎస్ఐలు ధరణీబాబు, మహ్మద్‌గౌస్ సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులను సోదా చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు పలు సూచనలను చేశారు.

యాడికి: గ్రామాల్లో ఆధిపత్యం కోసం గొడవలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని డీఎస్పీ సీఎం గంగయ్య హెచ్చరించారు. శుక్రవారం యాడికి, వెంగన్నపల్లెలో యాడికి రూరల్ సీఐ శంకర్ రెడ్డి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు సిబ్బందితో కలిసి పుట్ పెట్రోలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంగన్నపల్లె గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే కలిసిమెలిసి ముందుకు నడవాలన్నారు. ఎస్ఐలు గురుప్రసాద్‌రెడ్డి, ఖాజాహుసేన్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహన మండపం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రాచీన ఆలయం చింతల వెంకటరమణస్వామి ఆలయంలో రూ.20 లక్షలతో వాహన మండపం నిర్మాణానికి శుక్రవారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి భూమిపూ చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళీబట్టార్ ఆధ్వర్యంలో ఆగమశాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి సహకారంతో ఆలయంలో రూ.కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టునున్నామన్నారు. బ్రహ్మోత్సవ వాహనాలను భద్రపరిచేందుకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి చొరవతో వాహన మండపాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, పురావస్తు శాఖాధికారులు ప్రవీణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు శివారు ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న అరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. నిందితుల నుంచి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు షాపుల వేలం

శింగనమల: శివపురం పెద్దమ్మ దేవస్థానంలో సప్లయర్స్, టెంకాయలు, శీతల పానీయాలు, గాజులు, బొమ్మల షాపులకు శనివారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శోభ తెలిపారు. అనంతరం శాశ్వత హుండీ కానుకల లెక్కింపు ఉంటుందన్నారు.

రుణాలు స్వాహా చేశారని మహిళల ఆందోళన



ఏపీఎంలతో మాట్లాడుతున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: ఎస్సీ సబ్ ప్లాన్ కింద 2015 – 2018 మధ్యకాలంలో మంజూరైన రుణ మొత్తాన్ని అప్పటి అధికారుల నుంచి రికవరీ చేయాలంటూ మహిళలు వైకేపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రామరాజుపల్లె క్లస్టర్‌లోని నగరూరుకు చెందిన మహిళలకు ఉన్నతి కింద రూ 4.49 లక్షలు రుణం మంజూరైందని, కంతుల చెల్లింపు విషయంలో అప్పటి సీసీ రమేష్, యానిమేటర్ లక్ష్మినారాయణ తమకు తెలియకుండా డబ్బు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఏపీఎం చంద్రశేఖర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో శుక్రవారం అప్పటి ఏపీఎంలు రామ్మూర్తి, హేమలత, సీసీ రమేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. అయితే అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకోవడమే తప్ప స్వాహా నిధుల గురించి తేల్చలేదు. దీంతో ఆగ్రహించిన మహిళలు అధికారులను కార్యాలయం లోపల ఉంచి తాళం వేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకొని డ్వాక్రా మహిళలను శాంతింప చేశారు. ఉన్నతాధికారులు వచ్చి డ్వాక్రా మహిళల సమస్యను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



తురకపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తురకపల్లి, నేమతాబాద్ గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేను ఎద్దులబండిపై మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప వద్దకూ వెళ్లి నాలుగేళ్ల లో ప్రజలకు అందిన లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రతి గడపలోనూ నవరత్నాల వెలుగులు విరజిల్లుతున్నాయన్నారు. ప్రజల్లో ఆదరణ లేని ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ మతి భ్రమించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల గురించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడన్నారు. రాబోయే ఎన్నికల్లో బాబు, పవన్‌కు డిపాజిట్లు కూడా దక్కవనే అక్కసుతో ఎల్లో మీడియా ద్వారా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవని పవన్ కల్యాణ్‌కు వలంటీర్ల గురించి ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ సుందరమ్మ, ఎంపీటీసీ సుమలత, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలా యాదవ్, స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హనుమంతురెడ్డి, రంగస్వామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివయ్య, లక్ష్మన్న, కుమార్, రవి, ధోని, రఘునాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, క్రషర్ మధు, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, సచివాలయ రూరల్ కన్వీనర్ సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

గుత్తి: పట్టణంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మనుజ, తేజస్విని, లక్ష్య ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉషా చెప్పారు. శుక్రవారం విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాద సూచికల ఏర్పాటు

పెద్దవడుగూరు : మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి వెంబడి మలుపుల వద్ద, స్పీడ్ బ్రేకర్స్ వద్ద, రహదారుల జంక్షన్‌ల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ప్రమాద సూచికలను అనుసరిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



పొగాకు రామచంద్రను సన్మానిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ వీరా

పామిడి: పామిడిలో శుక్రవారం రాత్రి వాల్మీకి కార్పొరేషన్ నూతన చైర్మన్ పొగాకు రామచంద్రకు ఘన స్వాగతం లభించింది. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు ఆయనను స్వాగతించారు. ఈసందర్భంగా ఆయనకు వీరా తన స్వగృహంలో పూలమాలలు వేసి, శాలువాలతో ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో వాల్మీకులు, వీఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసముండే లక్ష్మి అనే మహిళపై శుక్రవారం పామిడికి చెందిన రాజు అనే వ్యక్తి అకారణంగా దాడి చేసి గాయపరిచాడు. ఘటనపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మహిళతో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్ష, జెడ్పీటీసీ రమణమ్మ

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమత, రాజకీయ, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నా వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గన్నెవారిపల్లి పంచాయతీ సచివాలయం – 2 పరిధిలో శుక్రవారం యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి స్థానికులతో సమస్యలపై ఆరాతీశారు. ఈసందర్భంగా వారు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. తాడిపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కట్టుబడి ఉన్నారని, గతంలో జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యేకు నేరుగా సమస్యలను విన్నవించుకునే అవకాశం కల్పించారన్నారు. జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ రవి కుమార్, వైఎస్సార్సీపీ నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భోగతి విజయప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక రజక వీధి సచివాలయ ఆవరణలో పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఎవరైన అర్హులకు ఏదైనా సంక్షేమ పథకం అందకపోతే తక్షణం వారికి అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్.జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ కమిషనర్ జి.రవి, కౌన్సిలర్లు రియాజ్, నాయకులు డీవీ కుమార్, జావీద్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: వెస్ట్ నరసాపురంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. సీఐ అస్రార్‌బాషా, సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి నారాయణ, మండల కన్వీనర్ నగేష్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ నాయక్ పాల్గొన్నారు.

పామిడి: ఖాదర్‌పేటలో శుక్రవారం జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, గుంతకల్ ఆర్డీఓ ఆర్ రవీంద్ర, ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, సర్పంచ్‌లు కే సుశీలమ్మ, నారాయణస్వామి, బాలనాగమ్మ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ షెక్షావలి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మనోహర్ రెడ్డి, ఓబుళప్ప పాల్గొన్నారు.

యల్లనూరు: శుక్రవారం వెన్నపూసపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి 131 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వీరరాజు, సర్పంచులు నాగకుమారి, సునీత, డీటీ శ్వేత, పంచాయతీరాజ్ ఇంజనీరు నరేంద్ర, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఏపీఓ షబ్బీర్ బాషా, ఏపీఎం ముత్యాలప్ప, సచివాలయ కన్వీనరు పెద్దిరెడ్డి, నాయకులు హరిశ్చంద్రారెడ్డి, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నార్పల: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దుర్గం గ్రామ సర్పంచు రామాంజనేయులు ప్రజలకు సూచించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా గ్రామంలో ఆయన పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఫరీదా బాను తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి సారించండి

బుక్కరాయసముద్రం: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండన్న అధ్యక్షతన సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ భాస్కర్ హాజరై మాట్లాడారు. వేరుశనగ సాగుకు సమయం మించి పోతున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. పథకాలు ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలన్నారు. వైస్ ఎంపీపీ రామగోపాల్, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, రుషింగప్ప, నాయకులు బుల్లే నారాయణస్వామి, సాకే లక్ష్మీనారాయణ, కొండారెడ్డి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, హెచ్‌ఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.